గిరిజనం.. అభివృద్ధికి సుదూరం

గిరిజనుల ప్రగతే మా అభిమతం అని కూటమి సర్కారు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తోంది. అయితే గిరిజన సామాజిక వర్గం మాత్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఎక్కడో మారుమూల అటవీ శివారు గ్రామంలో కాదు.. తిరుపతి నగర శివారులోని కరకంబాడి పంచాయతీలోని గిరిజనుల దుస్థితి. యానాదులున్న ఇందిరానగర్‌లో అపరిశుభ్రత.. నీటి సమస్య.. రేషన్‌కు 3 కిలోమీటర్ల అవల ఉన్న గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


రోడ్డుపై ఉన్న చెత్త


కొళాయి వద్ద నీటి కోసం వేచిఉన్న మహిళలు

- ఏడాది నుంచి నీటి కష్టాలు
- రేషన్ బియ్యానికి అవస్థలు
- కానరాని అధికారులు
- బోరుమంటున్న ఎస్టీ మహిళలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని ఇందిరానగర్‌లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. గ్రామంలో 350 యానాది కుటుంబాలున్నాయి. గ్రామంలో ఏడాది నుంచి నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రేషన్ బియ్యం ఇంటింటికీ వచ్చి ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం మూడు కిలోమీటర్లు దూరంలోని చౌక దుకాణానికి వెళ్లి, రేషన్ బియ్యం తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపులైన్‌కు గేట్‌వాల్ పాడైపోయిందని, దాని మరమ్మతుకు నీటి సరఫరా సిబ్బంది లంచం అడుగుతున్నారని వారు వాపోతున్నారు. కాలనీలో పగటి పూట సైతం వీధిదీపాలు వెలుగుతున్నా పట్టించుకునే నా థుడే కరువయ్యారు. గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బీసీ కాలనీలో తాగునీటి బోరు తవ్వారు. అందులో ఐదుఇంచుల వరకు నీళ్లు వచ్చాయి. కానీ ఇప్పటివరకు బోరుకు మోటరు అమర్చ లేదు. పైపులైన్లు వేయలేదు. పంచాయతీ పాలకులు, అధికారులు ఆ దిశగా ఆలోచన చేయటం లేదు. ఆ బోరు దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. గ్రామంలోని కొళాయి లో వచ్చే అరాకొర నీటితోనే కాలం గడుపుతున్నామని వారు చెబుతున్నారు.

మరమ్మతుకు డబ్బులు అడుగుతున్నారు



పైపులైన్ గేట్ వాల్ మరమ్మతులకు గ్రామస్తులను నీటి సరఫరా చేసే వ్యక్తి డబ్బు అడుగుతున్నాడు. ఇంటికి రూ.50 ఇస్తే మరమ్మతు చేస్తామని చెబుతున్నాడు. మేము పంచాయతీకి ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లిస్తున్నాం. పంచాయతీ అధికారులు మాత్రం మా కాలనీని పట్టించుకోవడం లేదు. –సుబ్రహ్మణ్యం ఇందిరానగర్

రేషన్ బియ్యానికీ అవస్థలు



గత ప్రభుత్వంలో ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యం సరఫరా చేసేవారు. ప్రస్తుతం మూడు కిలోమీటర్లు అవతల ఉన్న గ్రామంలోని రేషన్‌షాపునకు వెళ్లి బియ్యం తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఐదు కిలోల బియ్యం తెచ్చుకోవాలంటే రూ.40 ఆటో ఛార్జీ ఇచ్చి, వెళ్లాల్సివస్తోంది. మా గ్రామంలోనే రేషన్ షాపు పెట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–చెంగమ్మ ఇందిరానగర్

ఏడాదిగా నీటి కష్టాలు



గత సంవత్సరం రోజులుగా మా కాలనీలో నీటి సమస్య నెలకొంది. ఊరు మధ్యలో ఉన్న తాగునీటి కొళాయిలో గంట మాత్రమే నీళ్లు వస్తాయి. బట్టలు ఉతుక్కునేందుకు అందరూ పక్కన చెరువులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తాగడానికి అందరూ మినరల్ వాటర్ కొనుక్కొని తాగుతున్నాం. ఇంట్లో వాడుకునేందుకు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మా గ్రామంపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలి. –సుభాషిణి, ఇందిరానగర్

వారంలోపు సమస్య పరిష్కరిస్తాం

పంచాయతీలోని ఇందిరానగర్, బీసీ కాలనీ వాసుల కోసం రెండు బోర్లను కొత్తగా తవ్వించాం. ఇంకా సమస్య ఉంటే వారంలోపు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. –రమేష్ బాబు పంచాయతీ ఈఓ, కరకంబాడి

క్లుప్తంగా

సమ్మె విజయవంతం చేయండి

సత్యవేడు: లేబర్ కోడ్ల రద్దు కోసం దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ కోరారు. సోమవారం సత్యవేడు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రచురించిన బుక్‌లెట్‌ను ఆటోయూనియన్ కార్మికులతో కలిసి పంచిపెట్టారు. లేబర్ కోడ్ అమలులోకి వస్తే 29 కార్మిక చట్టాలు రద్దు అవుతాయన్నారు. లేబర్ కోడ్ రద్దుతో కార్మిక వర్గం సివిల్ కోర్టులకు వెళ్లే హక్కు కోల్పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు పన్నీరు మోహన్, బాబు, వినోద్, ఏలుమలై, బాలకృష్ణ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

బుచ్చినాయుడుకండ్రిగ: రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదికకు వినతులు వెల్లువెత్తాయి. పలువురు భూసమస్యలపై వినతులను అధికారులకు ఇచ్చారు. వినతులను విచారించి భూసమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్ఐ నల్లయ్య, వీఆర్ఓలు, పాల్గొన్నారు.

నివాళి

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలంలో పార్టీ కార్యకర్తలు మృతి చెందడంతో సోమవారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయా గ్రామాలకు చేరుకుని, నివాళులర్పించారు. శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన చిందేపల్లి జయమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని, ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని ఊరందురులో నాగోలు పకీర్ రెడ్డి మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సమాజ హితం ముఖ్యం

శ్రీకాళహస్తి: వ్యాపారాభివృద్ధే కాకుండా సమాజ హితమూ తమకు ముఖ్యమేనని ఎల్కో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్(ఈసీఎల్) స్పష్టం చేసింది. ఈసీఎల్ సంబంధిత సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టి శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. ఆ ప్లాంటును సోమవారం ఈసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖండేల్వాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతగా తొండమనాడు ఉన్నత పాఠశాల 500 మంది విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందించే ఖరీదైన ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఘనంగా సిస్టర్స్‌డే


నర్సులను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీకాళహస్తి: సిస్టర్స్‌డే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయ్ కుమారి, వజంతా, అన్నపూర్ణ, ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లను సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు జనమాల గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేదలకు వైద్య సేవలు అందిస్తున్న సిస్టర్స్ అందరికీ ధన్యవాదాలన్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి రోగుల ప్రాణాలను కాపాడడంలో సిస్టర్స్ ముందున్నారన్నారు. రోడ్ల గోపి, ఢిల్లీ బాషా, నిజాముద్దీన్, సుబ్రహ్మణ్యం, మూర్తి, చాంద్ బాషా, జాకీర్ పాల్గొన్నారు.

ముగిసిన గంధోత్సవం


సభలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్దలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని మిరియాల బాబా ఆశ్రమంలో మూడు రోజులపాటు జరిగిన గంధోత్సవం సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలో ముగింపు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి మాట్లాడుతూ ప్రపంచంలోనే పాకిస్తాన్ ఇస్లామిక్ వ్యతిరేక దేశంగా ముద్ర వేసుకుందన్నారు. హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీకగా గౌసియా ఆశ్రమ చారిటబుల్ ట్రస్ట్ 66 ఏళ్లగా ఈ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తూ హిందూ ముస్లింల ఐక్యతను చాటిచెబుతుందన్నారు.

పనులు ప్రారంభించండి


ఈఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం: సత్యవేడులో నూతనంగా నిర్మించనున్న టీటీడీ కళ్యాణ మండప పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీటీడీ ఈఓ శ్యామలరావుకు విన్నవించారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈఓను ఎమ్మెల్యే కలిశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఉన్న అడ్డంకులను పూర్తిగా క్లియర్ చేశామని, అటు రెవెన్యూ పరంగా, ఇటు తెలుగు గంగ శాఖపరమైన ఇబ్బందులేమీ లేవన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం


మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో ఉన్న కామమ్మ, మారయ్య నూతన దేవాలయ విగ్రహప్రతిష్ట, మహాకుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. వారికి నిర్వాహకులు స్వాగతం పలికారు. వారు కామమ్మ, మారయ్యను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు వారిని సత్కరించి, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. బుల్లెట్ జయశ్యామ్‌రాయల్, కల్యాణి, ప్రకాష్, శివ, గుణ, శ్రీహరి, సురేష్, మున్నా రాయల్,శరవణకుమార్, కంఠా ఉదయ్‌కుమార్, పీఎం చంద్ర, వేడం బాలిరెడ్డి, వెంకటేశ్వర్లు, జీవీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచంపై జ్ఞాన ప్రదాయినిగా కటాక్షం


హంస వాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: టీటీడీ అనుబంధ ఆలయమైన పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు సరస్వతీ దేవిగా హంసవాహనంపై విహరించారు. వేకువ జామున 5.30 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి పూజలు, హోమాలు చేశారు. 7.30 గంటలకు పిల్లనగ్రోవితో వేణుగోపాలుడిగా స్వామివారికి విశేషాలంకరణ చేసి, చిన్న శేషవాహనంపై కొలువుదీర్చారు. తరువాత మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ స్వామివారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. ఆలయానికి చేరుకున్న వెంకన్న ఉభయ దేవరులతో స్వామివారికి స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం జ్ఞానసరస్వతీ దేవిగా ఊయలలో కొలువుదీర్చి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు సరస్వతీ దేవిగా హంస వాహనంపై కొలువుదీరిన కల్యాణ వెంకన్నకు విశేష పూజలు చేశారు. పురవీధుల ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కాగా వాహనసేవలో భీమవరం, ఆచంట భజన మండళ్ల సభ్యులు 80 మందికి పైగా కోలాట ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ భద్రతా హమేదార్ రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జాతీయ నాయకులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. రేణిగుంట రైల్వేపెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం బ్రాంచ్ చైర్మన్ హసన్ సాహెబ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అత్తర్ సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం మార్చి 20 తేదీ అమలు చేసిన పెన్షనర్ల బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి జయంత్ కుమార్, అన్బు, సర్పంచ్ నాగేశం, కష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్‌లో..

రేణిగుంట రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం రైల్వే పెన్షనర్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ నాయకులను ఘనంగా సన్మానించారు. సీఆర్ఎస్ సీడబ్ల్యూఎం దేవ సహాయం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తిరుపతి రేణిగుంట శాఖలలో సేవలందించి రిటైర్డ్ అయిన పలువురిని ఘనంగా సన్మానించారు. సీఆర్ఎస్‌లోని పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ నాయకులకు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, చైర్మన్ గజపతి నాయుడు, కోశాధికారి కష్ట దాస్, ఎస్.కే.జబ్బార్, కేకే రెడ్డి,మోహన్ పాల్గొన్నారు.

దారి కబ్జా


దున్నేసిన గుండ్లకండ్రిగ - గుడిమల్లం మార్గం

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం గుండ్ల కండ్రిగ– గుడిమల్లం రోడ్డును ఓ వ్యక్తి దున్నేసి తన పొలంలో కలుపుకున్నాడు. స్థానికులు కథనం మేరకు.. గుండ్లకండ్రిగ నుంచి గుడిమల్లం పరశురామేశ్వరాలయం వరకు గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మించారు. అయితే ఆ దారిని గుండ్లకండ్రిగకు చెందిన కె.దామోదర్ నాయుడు అనే వ్యక్తి దున్ని వేసి, తన పొలం సమీపంలో కలుపుకున్నాడు. సుమారు 50 మీటర్ల దూరం వరకు రోడ్డును ఆక్రమించడంతో అటు వైపు వెళ్లే భక్తులు, రైతులు దారి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ అధికారులు రోడ్డు ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్ పార్క్‌లో సోమవారం శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రి, బిగ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో సుమారు 100 మందికి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ మయూర్, డాక్టర్ వివేక్ చైతన్య, డాక్టర్ దినేష్, డాక్టర్ పవన్ పాల్గొన్నారు.

పరశురామేశ్వరస్వామి సేవలో కోనసీమ కలెక్టర్


పరశురామేశ్వరస్వామి ఆలయంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఏర్పేడు(రేణిగుంట): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిళ్ల మహేష్‌కుమార్ సోమవారం ఏర్పేడు మండలం గుడిమల్లంలోని పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన సతీమణి నివేదితతో కలసి ఆలయానికి చేరుకోగా, వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం చేయించారు. వినాయక స్వామి ఆశీర్వాద మండపం వద్ద వేద పండితులు ఆశీర్వచనం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరి నాయుడు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది తదితర సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సమస్యలను తెలియజేస్తున్న మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు, ఎంపీడీఓ వెంకటరత్నమ్మను కోరారు. ఆయన సోమవారం నూతన ఎంపీడీఓ వెంకటరత్నమ్మ నాయకులతో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 పంచాయతీల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు కార్యాలయంలోని గదికి రాకపోయిన గదిని తీస్తున్నారని, ఆమె వచ్చినప్పుడే గదిని తీయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, ఎస్సీ సెల్ మండల నాయకులు గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లును ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: అఖిల భారత యువజన సమైఖ్య జాతీయ మహాసభల వాల్ పోస్టర్లును సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలో సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధి కోసం జరుగుతున్న భారత యువజన సమైఖ్య జాతీయ మహాసభలకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు. 209 దేశాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా జాయింట్ కార్యదర్శి నాగార్జున్, విద్యార్థి యువజన నాయకులు మహేంద్ర, మోహన్, అంకయ్య, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిత్రా పౌర్ణమి పూజలు


విశేషాలంకరణలో అంకాల పరమేశ్వరి

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని రామగిరిలో ఉన్న అంకాలపరమేశ్వరి ఆలయంలో సోమవారం చిత్రా పౌర్ణమి పూజలు వైభవంగా చేశారు. ఇందులో భాగంగా ఆలయంలో కొలువైన అంకాలపరమేశ్వరి అమ్మవారి మూల విరాట్‌కు పాలభిషేకం చేశారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాల్లో పున్నమి పూజలు

నారాయణవనం: తమిళ చిత్రా పౌర్ణమి సందర్భంగా సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సొరకాయల స్వామి అలయంలో ఉదయం అభిషేకాలు చేశారు. అలాగే సింగిరికోనలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామివారికి అభిషేకాలు, నవగ్రహ, ధన్వంతరి, మహాలక్ష్మి, సుదర్శన హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాకారోత్సవం అనంతరం ఊంజల్‌సేవ చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదాలు అందజేశారు. కైలాసనాథకోనలో కంచి, శివశక్తి ఆశ్రమాల్లో భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

బీసీ మహిళపై పోలీసుల తీరు అనైతికం

- అధికారం శాశ్వతం కాదు
- రెడ్‌బుక్ రాజ్యాంగంలో పోలీసులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మాజీ మంత్రి, బీసీ మహిళా నేత విడదల రజనీపై చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు ప్రవర్తించిన తీరు సమాజం సిగ్గుపడేలా ఉందని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎప్పుడూ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండిపోదనే వాస్తవాన్ని పోలీసులు గుర్తెరగాలని ఆయన హితవు పలికారు. ఓ మహిళ, మాజీ మంత్రి అయిన ఆమెపై పోలీసులు అత్యంత అభ్యంతరకరంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతున్న కూటమి ప్రభుత్వ పాలనలో కొందరి పోలీసుల తీరు దారుణంగా ఉందని మండిపడ్డారు. పోలీసులు తమ నిబంధనలను అతిక్రమిస్తున్నారని హైకోర్టు కూడా ఆగ్రహించిన సంఘటనలు రాష్ట్రంలోని నేటి పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ముస్లిం మతపెద్దలతో విద్యాశాఖాధికారుల భేటీ


ముస్లిం పెద్దలతో విద్యాశాఖాధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలలకు బదిలీ విషయంపై సోమవారం ముస్లిం మత పెద్దలతో ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథయ్య భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గత సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన విషయంపై చర్చించారు. అనంతరం ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరుతూ ముస్లిం మత పెద్దలు ఎంఈఓలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకుడు మునీర్ మాట్లాడుతూ రేణిగుంట పట్టణంలో ఉన్న 35 శాతం మంది ముస్లిం మైనారిటీ పిల్లల చదువుల కోసం ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరారు. ముస్లిం విద్యార్థులను పాఠశాలకు వచ్చేలా మత పెద్దలందరూ కృషి చేస్తామన్నారు. ముస్లిం మత పెద్దలు మహబూబ్ బాషా, ముబారక్, అష్రాఫ్, ఆలీ ఖలీల్, మస్తాన్, అఫ్రోజ్, జిలాని భాష, ఖాసిం పీర్, గౌస్ పీర్ పాల్గొన్నారు.

పికెట్ పాయింట్ తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ఆర్మ్‌డ్ పికెట్ పాయింట్ ను సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. విమానాశ్రయం నిత్యం తిరుమల, తిరుపతికి వచ్చే భక్తులు, వీఐపీతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి, విమానాశ్రయానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. విధులు నిర్వహించే సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు రక్షణ కరువు

వరదయ్యపాళెం: రాష్ట్రంలో లోకేష్ తీసుకువచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగంలో మహిళలకు రక్షణ కరువైందని, అందుకు నిదర్శనం ఒక మాజీ మంత్రి, బీసీ మహిళా నేతపై పోలీస్ శాఖకు చెందిన సీఐ వ్యవహరించిన తీరేనని నిదర్శనమని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా ధ్వజమెత్తారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విడదల రజనీ పీఏని అక్రమంగా అరెస్టు చేసి, తీసుకెళుతుంటే ప్రశ్నించినందుకు మహిళ అని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే రౌడీలా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అని, ఈ పరిస్థితులు చూస్తుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ స్థాయిలో దిగజారిపోయాయే అర్థమవుతుందన్నారు.

వేడుకగా అగ్నిగుండ ప్రవేశం

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం సీతారాంపేటలో ఉన్న పాండురంగస్వామి ఆలయ ఆవరణలో సోమవారం అగ్నిగుండ ప్రవేశం వేడుకగా జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కంకణాలు ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు.

దేవాంగ కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సత్యవేడు: రాష్ట్రంలో దేవాంగ కుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు సీఎం చంద్రబాబును ఈ మెయిల్ ద్వారా కోరారు. సత్యవేడులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. దేవాంగ కార్పొరేషన్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని సీఎంను కోరినట్లు తెలిపారు. పలుసార్లు రాష్ట్ర, కేంద్ర కార్యాలయాల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కోకన్వీనర్ జక్కుల శివానందం పాల్గొన్నారు.